సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం। 11। సెప్టెంబర్। 2023



రూ.1.01 లక్షల విరాళం

అమలాపురం టౌన్: వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అర్చకుల వసతి గృహాలకు పెద్దింటి వెంకట తిరుపతిరాజు కుటుంబీకులు (అమలాపురం) ఆదివారం రూ.1.01,000 విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి బల్ల శ్రీహరి, మంగతాయారు దంపతులు (నర్సాపురం మండలం చిన మామిడిపల్లి) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

లోవ దేవస్థానానికి..



తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి వెలివెల సీతారామాంజనేయ ప్రసాద్, ఆయన భార్య లక్ష్మీనాగరాజ్యం, కుమారుడు శ్రీగణ సాయి సమీర్ (తుని) ఆదివారం రూ.1,00,007 విరాళం సమర్పించారు.

న్యూస్‌రీల్

అవినీతికి ఆద్యుడు చంద్రబాబు

ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, నాయకులు

అమలాపురం టౌన్: ఎన్నో స్కామ్‌లకు ఆద్యుడైన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇన్నాళ్లకు స్కిల్ డెవలప్‌మెంట్ అవినీతిలో దొరికిపోవడంతో అతని అవినీతి డొంక కదులుతోందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు తెలిపారు. ఆదివారం అమలాపురం హైస్కూల్ సెంటర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి అడ్డదారిలో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారన్నారు. మామను మోసం చేసిన బాబు చరిత్రను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. చంద్రబాబు అవినీతి ఇప్పుడు ప్రజలకు అర్థం కావడంతో ఇన్నాళ్లకు ఎన్టీఆర్ ఆత్మకు సంతోషం కలుగుతుందని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. ఎన్టీఆర్‌ను మోసం చేసిన ఆ పార్టీ ముఖ్య నాయకులంతా పత్తా లేకుండా పోయారని ఆయన అన్నారు. చంద్రబాబు చేసిన అవినీతికి ఎప్పుడో అరెస్ట్ కావాలని, అయితే చట్టంలో లొసుగులను ఆసరా చేసుకుని తప్పించుకున్నాడని ఎమ్మెల్సీ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్‌ను ఆదిలోనే నాటి ప్రభుత్వ ఉన్నతాధికారులు పీవీ రమేష్, కె.సునీత వ్యతిరేకించి స్టేట్‌మెంట్లు కూడా ఇచ్చారంటే చంద్రబాబు ఈ స్కీమ్ ద్వారా ఎంతటి స్కామ్‌కు స్కెచ్ వేశారో అర్థమవుతుందన్నారు. చంద్రబా బు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి పేరిట తన బినామీ ఆస్తులను కూడగట్టుకున్నారని చెప్పారు. బినామీ ఆస్తులకు ఎదు రు తిరిగాడని సోదరుడు రామ్మూర్తి నాయుడిని పిచ్చివాడిగా చిత్రీకరించాడని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. దీనిపై సీబీఐతో ప్రత్యేక దర్యాప్తు చేయించాలని సూర్యనారాయణరావు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, నాయకుడు యనమదల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి డొంక కదిలింది

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



అమలాపురం టౌన్: మాజీ సీఎం చంద్రబాబు అవినీతి డొంక కదిలిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ఆలమట్టి డ్యామ్ నుంచి నేటి స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ వరకూ బాబు అవినీతి సామ్రాజ్యం ఇక ఒక్కొక్కటిగా వెలుగు చూస్తాయన్నారు. ఆదివారం రాత్రి అమలాపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బాబు అరెస్ట్, ఆయనకు రిమాండ్ విధించి జైలు తరలించడంతో రాష్ట్ర ప్రజలకు కొన్ని వ్యవస్థలపై ఉన్న అపోహలు తొలిగి వాటిపై నమ్మకం పెరిగిందని గుర్తు చేశారు. బాబు 14 రోజుల రిమాండ్‌తో కాదు 14 నెలలు జైలులో మగ్గే రోజులు ముందు ముందు ఉన్నాయన్నారు. అతని మొత్తం అవినీతి కేసులను ఒక్కొక్కటిగా విచారిస్తే జీవితాంతం జైలులో ఉండే పరిస్థితులు ఉంటాయన్నారు. ఈ స్కామ్‌లో నారా లోకేష్ పాత్ర కూడా ఉందని, ఆ దిశగా సీఐడీ అధికారులు లోతైన విచారణ చేసి తండ్రీ కొడుకుల అవినీతి బండారం బయటకు వస్తుందని ఇజ్రాయిల్ అన్నారు. అవినీతిని ప్రశ్నిస్తానని చెప్పే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఇప్పుడు చంద్రబాబు అవినీతిని ప్రశ్నించకుండా అతనికి మద్దతు పలకడం చూస్తుంటే వారి మధ్య ఉన్న ప్యాకేజీ బంధం అర్థమవుతోందని అన్నారు.

నేడు యథావిధిగా 'స్పందన'

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి, ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి, తహసీల్దార్ కార్యాలయాల్లో గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు. అధికారులంతా సోమవారం ఉదయం 10 గంటల నుంచే ఫిర్యాదులను స్వీకరిస్తారని, గ్రామ స్థాయిలో వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య విజ్ఞాపనల స్వీకరణ ఉంటుందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తలుపులమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

తుని రూరల్: లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన పది వేల మంది భక్తులు క్యూలైన్ల ద్వారా తలుపులమ్మను దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాలతో రూ.1,06,440, పూజా టికెట్లకు రూ.96,770, విరాళాలు కలిపి రూ.4,41,024 ఆదాయం సమకూరిందన్నారు.

నాడు కళ్లకు గంతలు..
నేడు రోతరాతలు..

- ప్రతి ధాన్యపు గింజా కొనుగోలుకు ప్రభుత్వం భరోసా
- అయినా 'ఈనాడు'లో తప్పుడు కథనం
- ఖరీఫ్ పంట కొనుగోలుపై అసత్య రాతలు
- నిజాలు కప్పిపుచ్చవద్దంటున్న రైతులు



మే 6న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తడిసిన ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమలాపురం: 'కాసే చెట్టుకే రాళ్ల దెబ్బలు' అన్నట్టు ధాన్యం కొనుగోలు చేయని గత ప్రభుత్వాలను గాలికి వదిలేసి... రైతుల వద్ద ప్రతి ధాన్యపు గింజా కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్న రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, పచ్చ మీడియా నిత్యం అక్కసు వెళ్లగక్కుతూనే ఉంది. గత టీడీపీ హయాంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయమే అయినా... బుక్ ఎంట్రీ తప్ప గింజ ధాన్యం కొనుగోలు చేయకున్నా.. నాడు 'ఈనాడు' కళ్లకు గంతలు కట్టుకుంది. ఇప్పుడు ప్రతి గింజా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నా ప్రభుత్వంపై తప్పుడు కథనాలు వండుతూ విషాన్ని చిమ్ముతోంది. 'ఈనాడు' తాజాగా 'ఖరీఫ్ పంట కొంటారా' అంటూ ఒక కథనాన్ని అచ్చువేసి జనం మీదకు వదిలింది. ఈ కథనంలో ధాన్యం కొనుగోలు సీజన్ వారీగా తగ్గిపోతోందని, ఇందుకు ప్రభుత్వ అలసత్వమే కారణమని పేర్కొంది.

ఈనాడు ఆరోపణ: రబీలో ధాన్యం సేకరణ లక్ష్యం, కొనుగోలు తగ్గింది.

- గత ఏడాది 2021–22 రబీ ధాన్యం సేకరణ లక్ష్యం 6.36 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, కొనుగోలు 4.41 మెట్రిక్ టన్నులు జరిగింది. 2022–23 రబీలో సన్నరకాలు (ఫైన్ వెరైటీ) 3.31 లక్షలు, బొండాలు (ఎంటీయూ–3626) మరో 3 లక్షల మెట్రిక్ టన్నులు సాగు చేశారు. అయితే బొండాల సాగు చేయవద్దని ప్రభుత్వం ముందే చెప్పింది. అయినా రైతులు పెద్ద ఎత్తున సాగు చేశారు. ఈ కారణంగానే ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 2.80 లక్షల మెట్రిక్ టన్నులుగా పెట్టుకుంది.
- రబీ ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో మంచి ధర వచ్చింది. దీంతో ఆర్‌బీకేల ద్వారా అమ్మకాలు చేయాల్సిన అవసరం రైతులకు పెద్దగా రాలేదు. కొనమని చెప్పిన బొండాల రకాలను సైతం కేరళ ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చి జిల్లాలో 16,124.240 మెట్రిక్ టన్నులు కొన్నారు. మిగిలిన రకాలను మిల్లర్లు కొన్నారు.
- ఏప్రిల్, మే నెలలో భారీ వర్షాలతో ధాన్యం నూక, మొలకలొచ్చాయి. నాన్ ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ (ఎఫ్ఏక్యూ) ధాన్యాన్ని మిల్లర్లచే కొనుగోలు చేయించింది. ఎఫ్ఏక్యూ ధాన్యాన్ని 1,41,540 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

ఈనాడు ఆరోపణ: దళారులే దిక్కు, కనీస మద్దతు ధర రాలేదు.

ఈ ఏడాది బియ్యం ఎగుమతులు అధికంగా ఉండడంతో బయట మార్కెట్‌లో మద్దతు కన్నా అధిక ధర వచ్చింది. దీనివల్ల రైతులు బయట విక్రయించేందుకే మొగ్గు చూపారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన ధాన్యానికి కనీస మద్దతు ధర వచ్చింది.

ఈనాడు ఆరోపణ: ఖరీఫ్ పంట కొంటారా?

ఖరీఫ్ కొనుగోలుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే సన్నాహాలు చేసింది. ప్రస్తుత ఖరీఫ్‌కు సంబంధించి 381 ఆర్‌బీకేల ద్వారా 3.81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి గింజను కొనుగోలు చేయాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా నిర్ణయించింది. ఇప్పటికే దీనికి సంబంధించి సమీక్షించడంతో పాటు ఆర్‌బీకే సాంకేతిక నిపుణుల నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేసింది.

గత టీడీపీ హయాంలో..

- **గత టీడీపీ** హయాంలో ఉమ్మడి తూర్పు **గోదావరి** జిల్లాలో ధాన్యం కొనుగోలు **పుస్తకాల్లో న**మోదుకే పరిమితం అయ్యింది. **2015 ఖరీఫ్‌లో** 12 లక్షల మెట్రిక్ టన్నుల దిగు**బడి కాగా కొ**న్నది 4 లక్షల మెట్రిక్ టన్నులు **(దిగుబడిలో** మూడో వంతు) మాత్రమే. ఇం**దులో 90 శాతం** రికార్డులలోనే.
- **నాడు కనీస** మద్దతు ధర రూ.1,057 కాగా, **కొనుగోలు కేం**ద్రాలలో కొనుగోలు లేక దళారు**లకు రూ.600** నుంచి రూ.800 విక్రయించే**వారు. ఇలా కొ**న్నదానిని వారు కొనుగోలు కేం**ద్రాలకు విక్ర**యించి రూ.1,057 ప్రభుత్వం **నుంచి పొందే**వారు.
- **కొనుగోలు లే**కున్నా కొన్నామని చూపించి కేంద్రాల నిర్వాహకులు క్వింటాలుకు రూ.32 కమిషన్ రూపంలో నొక్కేసేవారు. మహిళా సంఘాల నిర్వహణ ఉన్నచోట వారికి చీరలు బహుమతులు ఇచ్చి కమిషన్ కొట్టేసిన ఘనత తెలుగు తమ్ముళ్లది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

- ఆర్‌బీకేల స్థాయిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇక్కడ టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)ల నియామకంతో పాటు సహాయకులను తాత్కాలిక పద్ధతిలో అందుబాటులో ఉంచుతున్నారు.
- హమాలీ చార్జీలుగా క్వింటాలుకు రూ.22 చెల్లిస్తున్నారు. రవాణా చార్జీలను సైతం రైతులకు కాని, ప్రైవేట్ వ్యక్తులకు గాని అందజేస్తున్నారు.
- ప్రత్యేక సందర్భాలలో రైతుల క్షేత్రాల వద్దకు వెళ్లి మరీ కొనుగోలు చేస్తున్నారు. తడిచిన ధాన్యాన్ని ఆఘమేఘాలపై కొనుగోలు చేయించారు.

ప్రతి గింజా కొన్నాం

ప్రతి గింజా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాం. ఈ ఏడాది రబీలో బొండాలు అధికంగా సాగు చేయడంతో కొనుగోలు తక్కువగా కనిపించింది. అకాల వర్షాలతో ధాన్యం దెబ్బతిన్నా ప్రభుత్వం చొరవ చూపి మిల్లర్లతో కొనుగోలు చేయించింది.

– సుధాసాగర్, జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్


సకాలంలో ధాన్యం సొమ్ము



గత రబీలో ఆరెకరాలు కౌలుకు చేశాను. అకాల వర్షాలకు పంట కొంతమేర తడిసిపోయింది. అవిడి ఆర్‌బీకే–1 ద్వారా అమ్మకాలు సాగించాను. సిబ్బంది ఎటువంటి కొర్రి వేయకుండా కొన్నారు. ఏప్రిల్ 23న ధాన్యం విక్రయించగా, మే 2న 118 కింటాళ్ల ధాన్యానికి రూ.2,40,720 నా బ్యాంక్ అక్కౌంట్‌లో జమ అయ్యింది. ప్రకృతి సహకరించకపోయినా ప్రభుత్వం ఎంతో సాయం చేస్తుంది.

– దెందుకూరి సూర్యనారాయణరాజు, కౌలురైతు, అవిడి, కొత్తపేట మండలం

ప్రభుత్వ ఔదార్యంతో..



ధాన్యానికి కేంద్రం గ్రేడెడ్ ఎంఎస్‌పీ ప్రకటించాలి. అప్పుడు తడిచిన ధాన్యం కూడా కొనే అవకాశం ఉంటుంది. ఎఫ్‌సీఐ నిబంధన ప్రకారం కిలో ధాన్యం నుంచి 67 శాతం బియ్యం రావాలి. లేకుంటే ఎఫ్‌సీఐ లేవి సేకరించదు. కేంద్రం నిబంధనలు మార్చకున్నా రాష్ట్ర ప్రభుత్వం ఔదార్యం చూపి దెబ్బతిన్న ధాన్యం కొంటుంది.

– జిన్నూరి రామారావు (బాబి), ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



శ్రీకృష్ణ యాదవ సంఘ సమాఖ్య సభ్యులను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం ఆలమూరులో శ్రీకృష్ణ యాదవ సమాఖ్యకు చెందిన సుమారు 300 కుటుంబాల్లోని 500 మంది మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పెద్ద కాలువ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారందరికీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్ రాష్ట్రాభివృద్ధికి, పేదల సంక్షేమానికి చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు శ్రీకృష్ణ యాదవ సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. అనంతరం ప్రభుత్వం సమకూర్చిన మూడు సెంట్లలో భూమిలో శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి మంత్రి కారుమూరి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల వైపు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉందన్నారు. నిస్వార్థంగా పార్టీలో చేరిన యాదవులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, కురుపూడి శ్రీనివాసరావు, యాదవ సంఘ ప్రతినిధి రావి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నేలపూడి లావణ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాబూ నిజాయితీ నిరూపించుకో..

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: తాను నిప్పులాంటి వాడినని చెప్పుకొనే మాజీ సీఎం చంద్రబాబు కోర్టులో నిజాయితీని నిరూపించుకోవాల్సింది పోయి, ఎందుకు ఉలిక్కి పడుతున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. ఆదివారం ద్వారపూడిలోని ఓ కార్యక్రమానికి హాజరైన తోట విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టుపై ఘాటుగా స్పందించారు. నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని చంద్రబాబు తన షెల్ కంపెనీలకు మళ్లించారన్నారు. నీతిమంతుడైతే తన నిజాయితీని నిరూపించుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో ఎంతోమంది న్యాయవాదులు ఉండగా, ఢిల్లీ నుంచి హడావుడిగా ప్రత్యేక విమానంతో న్యాయవాదులను రప్పించుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని ఎమ్మెల్సీ తోట ప్రశ్నించారు. ఎన్నో కేసుల్లో నిందితునిగా ఉన్న చంద్రబాబు కోర్టుకు హాజరు కాకుండా స్టే తెచ్చుకుని తిరుగుతున్నారన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని, టీడీపీ నాయకులు అతి చేయాల్సిన అవసరం లేదన్నారు. అభివృద్ధి పేరిట చంద్రబాబు రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారన్నారు. టిడ్కో ప్లాట్లలో చదరపు అడుగుకు రూ.వెయ్యి నుంచి రూ.1.500 ఇస్తే సరిపోయేదానికి ఏకంగా రూ.రెండు వేలకు పైగా కాంట్రాక్టు సంస్థకు ఇచ్చి ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు. హైదరాబాద్ వంటి మహానగరంలో చదరపు అడుగుకు రూ.4 వేల వరకు ధర లేదని, అటువంటిది అమరావతిలో ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం ఏకంగా చదరపు అడుగుకు రూ.10 వేలు కాంట్రాక్టర్‌కు కట్టబెట్టిన ఘనుడు చంద్రబాబు అని ఎమ్మెల్సీ విమర్శించారు. సొసైటీ చైర్మన్ తులా శ్రీరంగారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యమైన భవితకు..

- వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- భవిత కేంద్రాల్లో పోస్టుల భర్తీకి చర్యలు



భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు కృత్యాలు బోధిస్తున్న ఐఈఆర్‌పీ

రాయవరం: దివ్యాంగుల దివ్యమైన భవితకు ప్రభుత్వం బాటలేస్తోంది.. అందరితో సమానంగా వారూ ఉండేలా చర్యలు చేపడుతోంది.. వీరికోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. దృష్టి, వినికిడి లోపమున్న చిన్నారులకు డిజిటల్ విద్యనందించాలనే సంకల్పంతో ప్రభుత్వం గతేడాది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చింది. ఆ మాదిరిగా 1–10 తరగతుల్లోని దివ్యాంగ చిన్నారులకు వారి అవసరాలకు ఉపయోగపడే విధంగా కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసింది. దివ్యాంగులకు బోధన అందించేందుకు, అవసరమైన పరికరాలను ఇచ్చేందుకు భవిత కేంద్రాలను ఇప్పటికే బలోపేతం చేసింది. అక్కడ సిబ్బందిని భర్తీ చేసేందుకూ చర్యలు తీసుకుంటుంది. జిల్లా వ్యాప్తంగా 22 భవిత కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో 484 మంది చిన్నారులు చదువుతున్నారు. ఇక్కడ రిసోర్స్‌పర్సన్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ వెలువరించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన నోటిఫికేషన్‌లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎంఆర్ పోస్టులు 10, హెచ్ఐ/వీఐ పోస్టులు 9 భర్తీ చేయనున్నారు. అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతూ ఖాళీలున్న చోట్ల ఆయా జిల్లా సమగ్ర శిక్ష అధికారులు భర్తీకి చర్యలు చేపడుతున్నారు. ఒక కేంద్రానికి ఇద్దరు రిసోర్స్ పర్సన్లు చొప్పున ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

దరఖాస్తులకు 18 తుది గడువు

ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ (సహిత విద్య)లో ఖాళీగా ఉన్న మానసిక వైకల్యం (ఎంఆర్), వినికిడి, చెవిటి (వీఐ,హెచ్ఐ) విభాగాలకు చెందిన పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఖాళీ పోస్టుల భర్తీ కోసం ఈ నెల 4 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. హెచ్‌టీటీపీ.ఏపీఐఈ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 18వ తేదీలోగా అర్హత ఉండి, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత ఏంటంటే..

అభ్యర్థుల వయసు 18– 42 ఏళ్ల మధ్య ఉండాలి. 2023 జూలై 31 నాటికి 42 ఏళ్ల లోపు వయసు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్స్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయో పరిమితి సడలింపు ఉంటుంది. సాధారణ డిగ్రీతో పాటు రీహేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) గుర్తించిన స్పెషల్ బీఈడీ విద్యార్హత కలిగి ఉండాలి. లేదా సాధారణ డిగ్రీతో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఏడాది డిప్లొమా కోర్సు చేసి ఉండాలి. లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు సాధారణ బీఈడీ డిగ్రీ ఆర్‌సీఐ గుర్తింపు కలిగిన రెండేళ్ల డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ కలిగి ఉండాలి. లేదా బ్యాచిలర్ డిగ్రీ, జనరల్ బీఈడీ డిగ్రీ విత్ పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ రికగ్నైజ్డ్ బై ఆర్‌సీఐ లేదా ఇంటర్మీడియేట్, ఆర్‌సీఐ గుర్తించిన స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డీఈడీ కలిగి ఉండాలి. సీడబ్ల్యూఎస్ఎన్ రిసోర్స్ పర్సన్‌గా ఎంపికైన వారికి నెలకు రూ.20 వేల గౌరవ వేతనం అందజేస్తారు. గౌరవ వేతనం పెంచడానికి, తగ్గించడానికి ప్రభుత్వానికి అధికారం ఉంటుంది. రోస్టర్ కమ్ మెరిట్ ప్రాతిపదికన నియామకాలు చేపడతారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికన పోస్టులు భర్తీ చేస్తారు. జిల్లా సెలక్షన్ కమిటీ నియమ నిబంధనల మేరకు నియామకాలు చేపడతారు.

జిల్లాలో ఖాళీలు ఇలా..

మండలం	ఎంఆర్	హెచ్ఐ/వీఐ
అయినవిల్లి	01	--
ఆలమూరు	01	01
అల్లవరం	--	01
అమలాపురం	--	01
అంబాజీపేట	--	01
ఆత్రేయపురం	01	--
ఐ.పోలవరం	01	--
కపిలేశ్వరపురం	--	01
కాట్రేనికోన	--	01
మలికిపురం	01	--
ముమ్మిడివరం	01	--
పి.గన్నవరం	01	01
రావులపాలెం	01	--
రాయవరం	01	01
సఖినేటిపల్లి	01	01

విద్యాభివృద్ధికి బాటలు



భవిత కేంద్రాల్లో రిసోర్స్ పర్సన్ల ఖాళీల భర్తీతో దివ్యాంగ చిన్నారుల విద్యాభివృద్ధికి బాటలు పడతాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో భవిత కేంద్రాలు బలోపేతమవుతాయి. చిన్నారుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెరుగుతాయి.

– ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా సహిత విద్య సమన్వయకర్త, అమలాపురం

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



ప్రభుత్వం భవిత కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను తీర్చిదిద్దాలన్న ఆశయంతో ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుంది. భవిత కేంద్రాల్లో పోస్టులకు అర్హత ఉండి, ఆసక్తి గల అభ్యర్థులు 18వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి.

– ఎం.కమలకుమారి, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్షాభియాన్, అమలాపురం

జిల్లాలో 144 సెక్షన్ అమలు

- చంద్రబాబుకు రిమాండ్ నేపథ్యంలో అప్రమత్తం
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
- జిల్లా ఎస్పీ శ్రీధర్



అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కోర్టు రిమాండ్ విధించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించిన 144 సెక్షన్‌ను జిల్లాలోని 22 మండలాల్లో కూడా అమలు చేస్తున్నట్లు ఎస్పీ సుసరాపు శ్రీధర్ తెలిపారు. ఆదివారం రాత్రి ఎస్పీ శ్రీధర్ 'సాక్షి'తో మాట్లాడారు. రిమాండ్ అనంతరం చంద్రబాబును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తున్న దృష్ట్యా జిల్లా పోలీసు శాఖ తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తోందన్నారు. 144 సెక్షన్ అమలులో ఉండడంతో జిల్లాలో ఎవరూ రోడ్లపైకి వచ్చి గుమిగూడడం, ఆందోళనలు చేపట్టడం నిషిద్ధమని ఎస్పీ స్పష్టం చేశారు. ఎవరైనా ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. చంద్రబాబును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తున్న క్రమంలో బందోబస్తుపరంగా అదనపు బలగాలను రంగంలోకి దింపినట్లు వివరించారు. జిల్లాలోని అమలాపురం, రావులపాలెం, కొత్తపేట, రాజోలు, ముమ్మిడిరం, రామచంద్రపురం, మండపేట తదితర ముఖ్య ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును సిద్ధంగా ఉంచామని చెప్పారు. ఆందోళనకు దిగే పరిస్థితులు ఉన్న టీడీపీ ముఖ్య నాయకుల ఇళ్ల వద్ద కూడా బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ వివరించారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలతో ఎస్పీ ఆదివారం రాత్రి ప్రత్యేక వైర్‌లెస్ సెట్ కాన్ఫరెన్స్ ద్వారా శాంతి భద్రతలపై ఆయన చర్చించారు.

క్లుప్తంగా

నేటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా

రాజానగరం: అనివార్య కారణాలతో సోమవారం నిర్వహించాల్సిన పీజీ (ఎంబీఏ, ఎంసీఏ) రెండో సెమిస్టర్, ఎంఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. ఈ మేరకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షలు తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

సీఎంఆర్ జ్యూయలర్స్ ప్రారంభం



సీఎంఆర్ జ్యూయలరీ షాపును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

తుని: స్థానిక మెయిన్ రోడ్డులో సీఎంఆర్ జ్యూయలర్స్ 16వ బ్రాంచ్‌ను ఆదివారం ప్రారంభించారు. మంత్రి దాడిశెట్టి రాజా తండ్రి దాడిశెట్టి శంకరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి జ్యోతిప్రజ్వలన చేసి షోరూమ్‌ను ప్రారంభించగా, ప్రముఖ వ్యాపారవేత్త చెక్కా తాతబాబు మొదటిగా బంగారు ఆభరణాలు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి మాట్లాడుతూ తుని పట్టణంలో సీఎంఆర్ జ్యూయలరీ షాపును ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. సీఎంఆర్ డైరెక్టర్ మావూరి మోహన బాలాజీ పాల్గొన్నారు.

పిడుగుపడి పెంకుటిల్లు ధ్వంసం



పిడుగుపడి ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: రామన్నపాలెంలో ఆదివారం తెల్లవారు జామున జొన్నకూటి సుబ్బారావు పెంకుటింటిపై పిడుగుపడి పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో సుమారు రూ.2 లక్షల నష్టం జరిగినట్టు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేష్ తెలిపారు. చుట్టపక్కల ఇళ్లలోని ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు కాలిపోయినట్టు ఆయన వివరించారు. ధ్వంసమైన గృహాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5 వేల నగదు, 20 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు ఆయన అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయం వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. సర్పంచ్ కూచిపూడి బుల్లయ్య, ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ కూచిపూడి వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆటకు వేళ

- స్కూల్ గేమ్స్‌కు రంగం సిద్ధం
- ఐదు స్థాయిల్లో క్రీడా పోటీలు
- అండర్–11, 14, 17, 19 విభాగాల్లో ఎంపికలు
- నేటి నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలు (ఫైల్)

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నువ్వా నేనా అంటూ జరిగే క్రీడా సమరానికి గంట మోగింది.. పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్‌కు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పరిధిలోని ఎస్‌జీఎఫ్ఐ జిల్లా శాఖ మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి ఎంపికలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, పీఈటీ సంఘ సభ్యులు ఈ ఎంపికలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్నీ సిద్ధం చేశారు. గత టీడీపీ హయాంలో స్కూల్ గేమ్స్ ఎంపికలు, పోటీలు జరిగాక నిధులు అందించేవారు. దీంతో నిర్వహణ ఇబ్బందిగా ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సమగ్ర శిక్షాభియాన్ నిధుల నుంచి పాఠశాల క్రీడా సమాఖ్య పోటీలు, ఎంపికలకు నిధులు ముందుగానే మంజూరు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ ఏడాది రూ.7.42 కోట్ల నిధులు రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో పోటీల నిర్వహణ, క్రీడాకారుల ఎంపిలకు, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులను పంపడానికి, వారికి క్రీడా దుస్తులు అందించేందుకు మంజూరు చేశారు. ఇది క్రీడలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని తెలియజేస్తోంది.

నేటి నుంచి నియోజకవర్గ పోరు

స్కూల్ గేమ్స్ అండర్–14, 17 పోటీలలో భాగంగా సోమవారం నుంచి 16 వరకూ నియోజకవర్గ స్థాయి ఎంపికలు ప్రారంభం కానున్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, యోగా అంశాల్లో ఎంపికలకు నిర్వాహకులు ఇప్పటికే వేదికలను, ఇన్‌చార్జులను ఖరారు చేశారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు వారి నియోజకవర్గంలో ఎంపిక చేసిన కేంద్రాల్లో జరిగే పోరులో పోటీ పడతారు. అక్కడ ఎంపిక చేసిన జట్లు జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు నేరుగా అర్హత సాధిస్తారు. వీరితో పాటు మిగిలిన మరో 23 క్రీడాంశాలతో కలిపి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో తలపడతారు.

జిల్లా స్థాయిలో 32 క్రీడాంశాలు

జిల్లా స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపిక పోటీలు మొత్తం 32 క్రీడాంశాల్లో జరగనున్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్; హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, తైక్వాండో, జూడో, సెపక్‌తక్రా, హాకీ, టెన్నిస్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, ఫెన్సింగ్, చెస్, బాల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, రోలర్ స్కేటింగ్, ఆర్చరీ, బాక్సింగ్, రగ్బీ, వెయిట్ లిఫ్టింగ్, సాఫ్ట్‌బాల్, రోప్ స్కిప్పింగ్ క్రీడాంశాల్లో ఎంపికలు జరుగుతాయి.

స్కూల్ గేమ్స్‌కు అర్హులు ఎవరంటే..

స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు అండర్–11 (స్కేటింగ్), 14, 17, 19 వయో విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా జరుగుతాయి. పాఠశాల విద్య పరిధిలో అండర్–14, 17 విభాగాలు, ఇంటర్మీడియేట్ విద్య పరిధిలో అండర్–19 ఎంపికలు ఉంటాయి. అండర్–14 బాలబాలికలు 2010 జనవరి ఒకటి, అండర్–17కు 2007 జనవరి ఒకటి, అండర్–19కు 2005 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలి. అండర్–14కు 8వ తరగతి చదువుతూ, అండర్–17కు ఇంటర్ ఫస్ట్ఇయర్, అండర్–19కు డిగ్రీ ఫస్ట్ ఇయర్ లోపు చదువుతూ ఉండాలి.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనే బాలబాలికలు స్కూల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ (ఎస్ఈఎం) యాప్‌లో తప్పనిసరిగా తమ వివరాలు నమోదు చేసుకోవాలి. పారదర్శకత కోసం ఈ ఏడాది మొదటిసారిగా ఈ విధానాన్ని తీసుకు వచ్చారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ అన్ని యాజమాన్యాల పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులు వారి యూ–డైస్ కోడ్‌తో పాఠశాల పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ కావాలి. అందులో ఎస్‌జీఎఫ్ పోర్టల్‌లో క్రీడాకారులు తమ వివరాలు నమోదు చేయాలి.

పారదర్శకంగా పోటీలు



విద్యార్థి జీవితంలో కీలకమైన స్కూల్ గేమ్స్‌ను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. వారు శిక్షణ పొందుతున్న క్రీడలో ప్రతిభ చాటాలి. ఈ ఏడాది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు హాజరయ్యే బాలికల జట్లతో పాటు మహిళా పీఈటీని మేనేజర్‌గా పంపించాలనే నిబంధన పెట్టాం. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– జి.భానుమూర్తిరాజు, ఐపీఈ, రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి

పూర్తి స్థాయిలో ఏర్పాట్లు



జిల్లాలో స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నాం. డీఈఓ నేతృత్వంలో పీఈటీ సంఘ నాయకులు, ఎంఈఓలు, నియోజకవర్గ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్లు సమన్వయంతో పోటీల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తొలుత జిల్లాలో అత్యంత ఆదరణ కలిగిన 9 క్రీడాంశాల్లో మండల, నియోజకవర్గ స్థాయి ఎంపికలు జరుగుతాయి. ఆ తర్వాత జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తాం.

– ప్రసాద్, పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి

ఇక్కడ ఎంపిక చేసిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున పాల్గొనున్నారు. పోటీల్లో అన్ని స్థాయిల్లో పాల్గొనే క్రీడాకారులకు మిడ్ డే మీల్స్‌లో భోజన సౌకర్యం కల్పించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

స్వామిని కొలిచి.. తన్మయత్వంతో మురిసి



శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన శ్రీబాల బాలాజీస్వామి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. తొలుత పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఉభయ దేవేరులతో కొలువు దీరిన స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.1.45 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.09 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.35,749 విరాళాలుగా వచ్చాయని ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు. 2,583 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 1,745 మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

కిక్కిరిసిన అయినవిల్లి



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో లక్ష గరిక పూజలు చేస్తున్న పండితులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో మేలుకొలుపు సేవ చేశారు. స్వామివారి పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 62 మంది, ప్రత్యేక దర్శనంలో 324 మంది, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 38 మంది పాల్గొని పూజలు చేశారు. 65 మంది చిన్నారులకు నామకరణం, అక్షరాభ్యాసం, అన్నప్రాశన, తులాభారం తదితరాలు నిర్వహించారు. స్వామికి ఆరుగురు తలనీలాలు సమర్పించగా, 16 మంది వాహన పూజ చేయించుకున్నారు. వేయవరం వాసి సుబ్రహ్మణ్యశర్మ కుటుంబ సభ్యులు స్వామివారికి లక్ష గరిక పూజ చేశారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.1,88,375 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

జీజీహెచ్ నుంచి బాలింత అదృశ్యం



గొర్ల వరలక్ష్మి

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో కవలలను ప్రసవించిన ఓ బాలింత అదృశ్యం కావడం చర్చనీయాంశమైంది. కాకినాడ రూరల్ మండలం స్వామినగర్ ప్రాంతానికి చెందిన గొర్ల వరలక్ష్మి (29) దివ్యాంగురాలు. పుట్టుక నుంచి మూగ, చెవిటితో బాధపడుతోంది. ఈ నెల 31న జీజీహెచ్‌లో చేరిన ఆమె అదే రోజు ఇద్దరు కవల ఆడ శిశువులకు జన్మనిచ్చింది. ఆమెను ప్రసవానంతర వైద్య సేవల కోసం పోస్ట్ నాటల్ వార్డుకు తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఆమెకు ఆసుపత్రిలో సంరక్షకురాలిగా వ్యవహరిస్తున్న బంధువు ఇంటి నుంచి ఆసుపత్రికి వెళుతున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆ విషయం తెలుసుకున్న వరలక్ష్మి వద్ద సంరక్షణ కోసం ఉన్న మరో మహిళ ఆమెను చూసి వచ్చేందుకు వెళ్లింది. అదే సమయంలో వరలక్ష్మి వార్డు నుంచి బయటకు వెళ్లింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో జీజీహెచ్ అధికారులు అంతా వెతికారు. అనంతరం సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించగా బాలింత తనకు తానే నడుచుకుంటూ ఆసుపత్రి ప్రధాన ద్వారం దాటి రోడ్డుపైకి వెళ్లడం స్పష్టంగా కనిపించింది. ఈ నేపథ్యంలో ఆసుపత్రి అధికారులు బాలింత అదృశ్యంపై కాకినాడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: విశాఖపట్నం స్వర్ణభారతి స్టేడియంలో ఈ నెల 2, 3 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన కరాటే జట్టుకు మొదటి నేషనల్ ఓవరాల్ చాంపియన్ షిప్ లభించిందని ఉమ్మడి జిల్లా కరాటే కోచ్ డి.శంకర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో విజేతలకు అభినందన కార్యక్రమం జరిగింది. లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, జిల్లా అధ్యక్షుడు చిత్తూలూరి వీర్రాజు, క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ మాట్లాడుతూ సుమారు దశాబ్ద కాలంగా సామర్లకోట విద్యార్థులకు శంకర్ శిక్షణ ఇస్తున్నారన్నారు. ప్రతి ఏటా శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు బహుమతులు సాధిస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు కోచ్ శంకర్ తెలిపారు. ఈ పోటీల్లో కాకినాడ, సామర్లకోటలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపడంతో ఓవరాల్ చాంపియన్ షిప్ దక్కిందన్నారు. క్లబ్ కార్యదర్శి ఎస్ఆర్‌వీ ప్రసాద్, కోశాధికారి బడుగు సీతారామరాజు తదితరులు విజేతలను అభినందించారు.



సాధించిన పతకాలతో పల్లవి

స్విమ్మింగ్ పోటీల్లో..

పెద్దాపురం: మహారాష్ట్ర పూణేలో జరిగిన జాతీయ స్థాయి రన్నింగ్, స్విమ్మింగ్ పోటీల్లో పెద్దాపురం మండలం ఆర్‌బీ పట్నం గ్రామ విద్యార్థి పల్లవి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. అండర్–11 కేటగిరీలో పోటీపడిన పల్లవి రెండు ఈవెంట్లలో తృతీయ స్థానం సాధించింది.

రేషన్ బియ్యం స్వాధీనం



జి.రాగంపేటలో పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పెద్దాపురం: జి.రాగంపేట గ్రామంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు ఆదివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అక్కడ గంటా సాయిబాబు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు ఐదు టన్నుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 96 సంచుల్లో ఈ బియ్యం ఉన్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ ఎన్.రమేష్, ఎంఎస్ఓ విజయకుమారి, వీఆర్వో వెంకటేశ్వరరావు, జీవన్‌కుమార్ బృంద సభ్యులు దాడులు నిర్వహించారు. ఈ బియ్యం విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని, బియ్యాన్ని సీజ్ చేసి అతనిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎంఎస్ఓ తెలిపారు.

ఎమ్మెల్యే పొన్నాడకు రూ.లక్ష చెక్కు అందజేత



ఎమ్మెల్యే పొన్నాడకు చెక్కు అందజేస్తున్న సంఘ సభ్యులు

ముమ్మిడివరం: ఐ.పోలవరం మండలం యానాం–ఎదుర్లంక వారధి వద్ద పాత ఇంజరంలో పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి కోటిపల్లి గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు ఆదివారం ఈ మొత్తం చెక్కును అందించారు. గ్రామ సర్పంచ్ పెమ్మాడి సత్తిబాబు, సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కారుమబ్బులు కమ్ముతు ఉంటే..



అంబాజీపేటలో కమ్మిన కారు మబ్బులు

అంబాజీపేట: భానుడి కిరణాలు ప్రసరిస్తున్న వేళ.. మరోపక్క కారుమబ్బులు కమ్ముతుంటే ఆకాశం ఆహ్లాదపరిచింది. నల్లటి మేఘాలతో ఆదివారం ఉదయం దర్శనమిచ్చి వాతావరణ ప్రేమికులను ఆనందింపజేసింది. అంబాజీపేటలో తెల్లవారుజామున ఏడు గంటల సమయంలో ఆకాశంలో ఒక్కసారిగా నల్లటి కారుమబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. కారుమబ్బులకు దారి కనిపించక వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది.

లారీల ఢీ: ముగ్గురికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రంజిత్‌రెడ్డి



ప్రమాదానికి గురైన లారీలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి 16వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం రెండు లారీలు బలంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బళ్లారికి చెందిన ఉటుకూరి రంజిత్‌రెడ్డి తన లారీపై బొగ్గు లోడు వేసుకుని చెన్నై నుంచి విశాఖపట్నం బయలుదేరాడు. చెందుర్తి 16వ నంబరు జాతీయ రహదారిపై వెళ్తుండగా రాజస్థాన్ రాష్ట్ర బర్ధపూర్ జిల్లా మెంటుకాకు చెందిన జామ్‌షేట్ కాన్, రిజ్వికాన్‌లు మరో లారీపై విశాఖపట్నం నుంచి వస్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఇవతల వైపు వెళుతున్న లారీని ఢీకొట్టారు. దీంతో రెండు లారీల కేబిన్లు నుజ్జునుజ్జు కావడంతో లారీల్లో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో రంజిత్‌రెడ్డి లారీ కేబిన్‌లో ఇరుక్కు పోగా పోలీసులు అతనిని బయటకు తీసి, మిగిలిన ఇద్దరితో కలిపి 108లో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

ఉపాధి కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- ఒమన్‌లో వివాహిత మృతి



నాగవేణి (ఫైల్)

అంబాజీపేట: పేదరికంతో బాధపడుతూ బతుకు దేవుడా అంటూ.. అయినవారిని వదిలి దేశం కాని దేశం వెళ్లిన ఓ వివాహిత గుండెపోటుతో మరణించింది. తమ కష్టాలు గట్టెక్కుతాయని అనుకున్న ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మరో ఆరు నెలల్లో తిరిగి స్వదేశానికి వచ్చి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతామని అనుకున్న ఆమె ఆశలు ఆవిరి అయ్యారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. ఇసుకపూడిలోని గూటంవారి పేటకు చెందిన సరెళ్ల నాగవేణి (58) పొట్టకూటి కోసం ఏడాదిన్నర కిందట మస్కట్‌లోని ఒమన్‌కు వెళ్లినట్లు ఆమె కుమారుడు శ్రీనివాస్ తెలిపారు. ఆరేళ్ల కిందట తన తల్లి ఉపాధి నిమిత్తం అక్కడికి వెళ్లిందని, తిరిగి వచ్చాక రెండేళ్లు ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిందన్నారు. మరోసారి ఒమన్‌కు ఉపాధికి వెళితే తమ కష్టాలు తొలగిపోయి కుటుంబమంతా సంతోషంగా ఉండవచ్చని ఏడాదిన్నర కిందట తన తల్లి మళ్లీ వెళ్లిందని వివరించారు. ఈ నేపథ్యంలో 5న నాగవేణికి గుండె పోటు రావడంతో ఒమన్‌లోని బ్రదర్ అల్సామా సోహార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం వచ్చింది. మస్కట్‌లోని ఇంటర్నేషనల్ అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో నాగవేణి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వస్తున్నారు. మృతదేహాన్ని తీసుకు వచ్చేందుకు కృషి చేసిన అంబేడ్కర్ సేవా సమితి ఫౌండర్, చైర్మన్ గాలి గనిరాజు, వైస్ చైర్మన్ మెడపట్ల లక్ష్మణ్, మహిళా అధ్యక్షురాలు జి.అంజలి రెడ్డి, అంబేడ్కర్ సేవా సమితి మహిళా అధ్యక్షులు కొనుకు దేవి, కరుణకుమారి, రాజు తదితరులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు.